ఓపెన్ స్కూల్ తత్కాల్ అడ్మిషన్ల గడువు పెంపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి, ఇంటర్మీడియట్ తత్కాల్ ప్రవేశాల ప్రక్రియకు సంబంధించిన తేదీలను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ప్రకటించింది. ఈ ప్రవేశాలకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తులు ఈనెల రెండో తేదీన ప్రారంభమయ్యాయి. తత్కాల్ పద్ధతిలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తును సమర్పించడానికి చివరి తేదీని ఈనెల పదో తేదీ వరకు పొడిగించారు. ఆసక్తి గల అభ్యర్థులు గడువులోగా తత్కాల్ ఫీజు చెల్లించి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత, వచ్చిన రిఫరెన్స్ నంబరుతో సమీపంలోని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్‌ను సంప్రదించి లాగిన్ ఐడి ద్వారా ప్రవేశ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవిబాబు తెలిపారు.

సొంతిళ్లు సాకారమయ్యేనా?

- పిఎంఎవై 2.0 సర్వే గడువు పెంపు
- ఈనెల 14 వరకు దరఖాస్తుల స్వీకరణ
- జిల్లావ్యాప్తంగా 60,766 దరఖాస్తులు
- ఎచ్చెర్ల మండలంలో అత్యధికంగా 3,948 దరఖాస్తులు

సొంతింటి నిర్మాణం కోసం పేదల నుంచి భారీగా డిమాండ్ కనిపిస్తోంది. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదిన్నర గడిచినా ఒక్క ఇంటినీ మంజూరు చేయలేదు. అంతకుముందు అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం 2022లో మాత్రమే జగనన్న ఇళ్లను మంజూరు చేసింది. దీంతో సుమారు మూడున్నరేళ్లుగా ఇళ్ల మంజూరు లేకపోవడంతో దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. గురువారంతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియనుండగా, ప్రభుత్వం ఈనెల 14వ తేదీ వరకు పొడిగించినట్లు తెలుస్తోంది. పేదల నంచి దరఖాస్తుల స్వీకరణతో పాటు సర్వేలో దరఖాస్తుదారుల నుంచి వచ్చిన వివరాలను గృహ నిర్మాణశాఖ ఎఇలు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం ద్వారా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రభుత్వం గత నెల 16 తేదీ నుంచి గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయ సిబ్బందితో సర్వే నిర్వహించారు. సొంతిల్లు, స్థలం కావాల్సిన వారు, సొంత స్థలం ఉండి ఇళ్లు కావాల్సిన వారి వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన ఆవాస్ యోజన యాప్‌లో నమోదు చేశారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 60,766 ఇళ్లను సర్వే చేశారు. సచివాలయ సిబ్బంది చేపట్టిన సర్వేపై గృహ నిర్మాణశాఖ అధికారులు కొన్ని ఎంపిక చేసిన కుటుంబాల వివరాలను పరిశీలిస్తారు. సర్వే వివరాలు సక్రమంగానే ఉన్నట్లు భావిస్తే వాటిని ఉన్నతాధికారులకు పంపనున్నారు. మరింత మంది పేదలను గుర్తించేందుకు సర్వే గడువును ఈనెల నాలుగో తేదీ నుంచి 14 వరకు ప్రభుత్వం పెంచినట్లు తెలుస్తోంది. పేదల నుంచి దరఖాస్తులు వస్తే తీసుకుంటామని, గడువు లోపు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనున్నట్లు గృహనిర్మాణ శాఖ అధికారులు చెప్తున్నారు.

పొందూరు మండలం లోలుగులో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

సర్వే సక్రమమేనా..?

పిఎంఎవై 2.0 సర్వే చాలాచోట్ల సరిగా చేపట్టలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సచివాలయ సిబ్బంది నేరుగా ఇళ్లు లేని పేదల వద్దకు వెళ్లి ఎవరికి అవసరమో, వారి వివరాలను ముఖ ఆధారిత, వేలిముద్రల ద్వారా అనుసంధానం చేయాల్సి ఉంటుంది. పలు గ్రామాల్లో ఇంజినీరింగ్ సహాయకులు సచివాయాలకు వచ్చిన వారికి మాత్రమే ముఖ ఆధారిత వివరాలు నమోదు చేస్తున్నారు. సొంత స్థలం ఉంటే స్థలంతో పాటు దరఖాస్తుదారుల వివరాలను స్థలం ఉన్న ప్రదేశంలోనే చేయాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే చేస్తే ఇంకొంత మంది పేదలకు సొంతిళ్లు దక్కే అవకాశం ఉండేది.

నియోజకవర్గాల వారీగా దరఖాస్తులు

నియోజకవర్గం	దరఖాస్తులు
శ్రీకాకుళం	5,232
ఆమదాలవలస	8,155
ఎచ్చెర్ల	10,712
ఇచ్ఛాపురం	7,266
పాతపట్నం	8,082
టెక్కలి	6,387
నరసన్నపేట	8,768
పలాస	6,164

వెల్లువెత్తిన దరఖాస్తులు

పిఎంఎవై ఆవాస్ ప్లస్ కింద ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయనుండడంతో పేదల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఎచ్చెర్ల మండలంలో అత్యధికంగా 3,948 దరఖాస్తులు వచ్చాయి. నరసన్నపేటలో 3,274 మంది పేదలు ఇళ్లు కావాలని అడిగారు. పొందూరులో 3,061, గారలో 3,401 మంది నుంచి ఇళ్లు కావాలని దరఖాస్తు చేసుకున్నారు. మందసలో 2,974 మంది, రణస్థలంలో 2,801 మంది, కవిటిలో 2,648 మంది ఇళ్లు కావాలని దరఖాస్తు చేసుకున్నారు. సరుబుజ్జిలి మండలంలో అత్యల్పంగా 1,401 దరఖాస్తులు వచ్చాయి.

నిర్ణయం కాని నిర్మాణ వ్యయం

పిఎంఎవై ఆవాస్ 2.0 కింద కేటాయించనున్న ఇళ్లకు లబ్ధిదారులకు ఎంతమేర ఆర్థికసాయం అందించాలో ప్రభుత్వం నిర్ణయించలేదు. సర్వే పూర్తయి అర్హుల జాబితా రూపొందించిన సమయంలో, ప్రభుత్వం నిర్మాణ వ్యయం ప్రకటించనున్నట్లు తెలిసింది. గత ప్రభుత్వం జగనన్న ఇళ్ల నిర్మాణం కోసం ఒక్కో లబ్ధిదారునికి రూ.1.80 లక్షల సాయం అందించింది. దీంతో పాటు ఉచిత ఇసుకను, రూ.30 వేలు రుణాన్ని బ్యాంకుల ద్వారా అందించింది. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వ సాయం చాలకపోవడంతో, సగం మంది కూడా ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాలేదు. ఇళ్లను నిర్మించినా చాలాచోట్ల అసంపూర్తిగానే ఉండిపోయాయి. దీంతో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం అసంపూర్తి గృహ నిర్మాణాలను పూర్తి చేసుకునేందుకు బిసిలకు రూ.50 వేలు, ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.75 వేలు, ఆదివాసీలకు రూ.లక్ష అదనంగా సాయం అందించింది. ఇప్పుడు పిఎంఎవై 2.0 కింద నిర్మించనున్న ఇళ్లకు ఎంతమేర ఆర్థికసాయం అందించనుందో చూడాల్సి ఉంది.

వజ్రపుకొత్తూరు మండలం సాయినూరులో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

సమావేశంలో మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం ఇవ్వాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు

ప్రజాశక్తి - రణస్థలం

ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మనాయుడు డిమాండ్ చేశారు. రణస్థలంలో బుధవారం నిర్వహించిన ఎపి గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీలో 19 ఏళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తూ ఉపాధి కూలీలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ గ్రామ పంచాయతీ స్థాయిలో సుస్థిర, శాశ్వత వనరులు ఏర్పాటు, గ్రామాల అభివృద్ధికి తోడ్పడుతున్నారని తెలిపారు. ఉపాధి హామీలో దేశంలోనే రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలబెట్టటంలో ఫీల్డ్ అసిస్టెంట్ల కృషి కీలకమైందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు నెలకు రూ.5,745 వేతనం ఇస్తున్నారని, అతి తక్కువ వేతనాలతో వారి కుటుంబాలు బతకడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల కుటుంబాలను పస్తుల నుండి కాపాడేందుకు వేతనాలు పెంచాలని కోరారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమ సమస్యలు తీరుతాయని ఫీల్డ్ అసిస్టెంట్లు భావించారని, గతేడాది కాలంలో రాజకీయ వేధింపులతో ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమ తొలగింపులు పెద్దఎత్తున జరిగాయన్నారు. ఇలాంటి ఒత్తిళ్లతో ఫీల్డ్ అసిస్టెంట్లు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ వేధింపులు అరికట్టి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసి న్యాయం చేయాలని కోరారు. వేతనాల చెల్లింపులు కోసం పనిదినాల విధానం రద్దు చేయాలని, రాజకీయ వేధింపులు లేకుండా ఉండడానికి మండల స్థాయిలో బదిలీల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. యాప్‌ల్లో కూలీల హాజరు, అప్‌లోడ్ సర్వర్ లోపాలను సకాలంలో సరిదిద్దాలని డిమాండ్ చేశారు. అర్హత, అనుభవం కలిగిన ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. ఎన్.ఎం.ఎం.ఎస్, భువన, ఇతర యాప్‌లు వాడుతున్న నేపథ్యంలో నాణ్యమైన కొత్త మొబైల్స్, 5జి సిమ్ కార్డులు ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ కూలీలకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షులు పి.బంగారునాయుడు, కె.రమణ, జి.గణేష్, కె.నాగేశ్వరరావు, వై.రామారావు పాల్గొన్నారు.

6న దిశ కమిటీ సమావేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశం ఈనెల 6వ తేదీ ఉదయం 10.30 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి జెడ్‌పి సిఇఒ పి.కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కేంద్ర మంత్రి, దిశ కమిటీ చైర్మన్ కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొంటారని పేర్కొన్నారు. మెంబర్ సెక్రటరీ, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

వికలాంగుల్లో ఆత్మస్థైర్యం అవసరం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

లాప్‌ట్యాప్‌ను అందజేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

వికలాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, అన్నిరంగాల్లో విజేతలుగా నిలబడాలని కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికలాంగులకు రిజర్వేషన్లు కల్పించడంతో పాటు వారి సంక్షేమానికి, అభివృద్ధికి అవసరమైన పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. వికలాంగుల సహకార సంస్థ ద్వారా వికలాంగులకు మూడు చక్రాల మోటార్ వాహనాలు, మూడు చక్రాల సైకిళ్లు, ఊత కర్రలు, వీల్‌ఛైర్స్, అందులకు చేతి కర్రలు కళ్లజోళ్లు, శ్రావణ యంత్రాలు, కృత్రిమ అవయవాలు అందిస్తామని తెలిపారు. ముఖ్యంగా స్వాభిమాన్ కార్యక్రమం ద్వారా ప్రత్యేక గ్రీవెన్స్‌లో వికలాంగుల సమస్యలు పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. వికలాంగులకు వైద్య సదుపాయాలు కల్పించడంతోపాటు వీరికి ప్రభుత్వం ఉద్యోగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్లు, ఉన్నత విద్య కోర్సుల్లో 5 ఐదు శాతం కేటాయించినట్లు తెలిపారు. దృష్టి లోపం ఉన్న వికలాంగులకు ప్రభుత్వాస్పత్రి రిమ్స్‌లో ఎఐ స్పెట్స్ అందుబాటులో ఉనట్లు చెప్పారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు వెంకటరమణమూర్తి మాట్లాడుతూ వికలాంగులకు అందిస్తున్న వికలాంగు పింఛను కూటమి ప్రభుత్వం రూ.6 వేలు ఇస్తుందని పేర్కొన్నారు. మంచంపై ఉన్న వారికి రూ.15 వేలు ఇస్తుందని తెలిపారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ వికలాంగులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించడంలో ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. వీరికి గృహాలు మంజూరు, కుటుంబ పింఛను వర్తింపు అన్ని రకాల రిజర్వేషన్లు కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు లాప్‌ట్యాప్‌లు అందించారు. వికలాంగుల దినోత్సవం సందర్భంగా గత నెల 28న ఏర్పాటు చేసిన క్రీడల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వికలాంగులశాఖ ఇన్‌ఛార్జి ఎడి బి.శైలజ పాల్గొన్నారు.

వికలాంగుల్లో ఆత్మవిశ్వాసం అవసరం

అసాధారణ ప్రతిభ కలిగిన వారే విభిన్న ప్రతిభావంతులని మెప్మా పీడీ ఎస్.వెంకటరావు అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ఎంపిసిఆర్‌సిలో మెప్మా ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విభిన్న ప్రతి భావంతుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం అర్హత కలిగిన సంఘాలకు బ్యాంకు రుణ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెప్మా సాంకేతిక నిపుణులు బి.రామారావు, స్త్రీనిధి పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షులు వి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సిఐటియు వ్యవస్థాపక నాయకులు కొండయ్య మృతి

- తుది శ్వాస విడిచే వరకు ఉద్యమాల్లో భాగస్వామ్యం
- పలువురు సంతాపం

ప్రజాశక్తి - ఆమదాలవలస

భౌతికకాయంపై సిఐటియు జెండా కప్పి నివాళ్లర్పిస్తున్న నాయకులు (ఇన్‌సెట్‌లో కొండయ్య ఫైల్ ఫొటో)

సిఐటియు తొలి తరం నాయకులు, జిల్లా వ్యవస్థాపకుల్లో ఒకరైన మెట్ట కొండయ్య (83) బుధవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శ్రీకాకుళం నగరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆమదాలవలస మండలంలోని కొత్తవలసకు చెందిన కొండయ్య 1942 ఫిబ్రవరి పదో తేదీన జన్మించారు. డిగ్రీ వరకు విద్యనభ్యసించిన ఆయన 1970లో కీ.శే చాపర అప్పారావు, కీ.శే దిగుమర్తి విశ్వనాథంతో కలిసి జిల్లాలో సిఐటియు నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు. ఎమర్జెన్సీ కాలంలో అనేక నిర్బంధాలను ఎదుర్కొని కార్మికోద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారు. ఆమదాలవలస సహకార చక్కెర కర్మాగారంలో పనిచేసిన ఆయన, కార్మికులను ఐక్యం చేసి 1970లో ఆ కర్మాగారంలో యూనియన్‌ను స్థాపించారు. ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా కార్మికుల సమస్యలపై ముందుండి పోరాటం చేసి వాటి పరిష్కారానికి కృషి చేశారు. 1971లో పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, బోనస్ చెల్లించాలని 56 రోజుల పాటు సాగిన సమ్మెను విజయవంతం చేయడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఈ సమ్మె ఫలితంగా ఉద్యోగుల వేతనాలతో పాటు బోనస్‌నూ సాధించుకున్నారు. చక్కెర కర్మాగారమే కాకుండా రైస్‌మిల్లులు, సినిమా హాళ్లు, జూట్ మిల్లులు, లష్కర్ కార్మికుల కోసం కూడా యూనియన్లు ఏర్పాటు చేయడంలో విశేష కృషి చేశారు. మూతపడిన చక్కెర కర్మాగారాన్ని తిరిగి ప్రారంభించాలని రైతాంగాన్ని కలుపుకొని పోరాటం చేశారు. తుది శ్వాస విడిచే వరకు కార్మికుల పోరాటాల్లో భాగస్వామ్యమయ్యారు. కార్మిక సమస్యలపైనే కాకుండా ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తూ వారి మన్ననలు చూరగొన్నారు. కొండయ్య తండ్రి మెట్ట ఆదింభట్లు 1988లో కొత్తవలస గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు.

ఏడాది తర్వాత ఆయన మృతి చెందడంతో కొండయ్య సర్పంచ్‌గా పోటీ చేసి గెలుపొందారు. పట్టణంలోని కొత్తకోట వారి వీధిలో స్థిరపడిన ఆయనకు భార్య రాజేశ్వరి, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కార్మిక ఉద్యమాలకు తీరని లోటు

కొండయ్య భౌతికకాయంపై సిఐటియు జెండాను కప్పి సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, సీనియర్ నాయకులు కె.శ్రీనివాసు, బి.కృష్ణమూర్తి, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి, రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వి.రమణ తదితరులు నివాళ్లు అర్పించారు. కార్మికుల సమస్యలపై కొండయ్య అలుపెరుగని పోరాటం చేశారని అన్నారు. ఆయన మరణం కార్మిక ఉద్యమాలకు తీరని లోటు అని అన్నారు.

ఎర్రజెండాని ముందుకు తీసుకెళ్లిన యోధుడు

మెట్ట కొండయ్య మృతికి సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.వి.నాగేశ్వరరావు, సిహెచ్.నర్సింగరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఎమర్జెన్సీ కాలంలో నిర్బంధాన్ని సైతం లెక్క చేయకుండా ఎర్రజెండాని ముందుకు తీసుకెళ్లిన యోధుడు అని కొనియాడారు. కార్మిక వర్గం కోసం చివరి వరకు పోరాడిన నాయకుడు అని పేర్కొన్నారు. ఆయన మృతి కార్మిక వర్గానికి తీరని లోటు అని అన్నారు.

హస్తకళలకు ప్రభుత్వ ప్రోత్సాహం

- నూతన నమూనాలు, రూపకల్పనలు అభివృద్ధి చేయాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - సారవకోట

హస్తకళలకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. మండలంలోని బుడితిలో కళాకారులు తయారు చేస్తున్న ఇత్తడి పాత్రలు, ఇతర హస్తకళ ఉత్పత్తుల అభివృద్ధి కోసం హస్తకళల విభాగం ఆధ్వర్యాన అందజేయబడుతున్న శిక్షణా కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి బుధవారం పరిశీంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి, ఆధునిక సాంకేతికతను వినియోగించి నూతన నమూనాలు, రూపకల్పనలు అభివృద్ధి చేయాలని సూచించారు. ఉత్పత్తులకు తగిన మార్కెటింగ్ వేదికలను ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వం ద్వారా అవసరమైన ఆర్థిక సహాయ సహకారం ఉంటుందని భరోసా కల్పించారు. ఆధునిక పరికరాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మరింత నాణ్యతతో, ఆకర్షణీయమైన ఉత్పత్తులు రూపొందిస్తే వాటిని కొనుగోలుదారులకు పరిచయం చేసేందుకు ప్రత్యేక చొరవ చూపుతామన్నారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి, లేపాక్షి ఎంపోరియం మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జెసి

పక్కాగా ధాన్యం నిల్వలు

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

కోటబొమ్మాళి: ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం నిల్వలను పక్కాగా నిర్వహించాలని, రికార్డులను ఎప్పటికప్పుడు సరిగా నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మిల్లర్లను ఆదేశించారు. మండలంలో ఆకస్మికంగా పర్యటించిన ఆయన, రైస్ మిల్లులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి, వాటి నిర్వహణ తీరును పరిశీలించారు. బోయిన ద్వారకానాథ్, వెంకటలక్ష్మి, వెంకట సరోజ రైస్ మిల్లులను తనిఖీ చేశారు. మిల్లుల్లోని ధాన్యం నిల్వ పాయింట్లను, కొనుగోలుకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. మిల్లుల నిర్వహణ తీరు, మిల్లింగ్ ప్రక్రియ వేగంపై యాజమాన్యాలతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం, చీపుర్లపాడు, జర్జంగి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జేసీ తనిఖీ చేశారు. ఆ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల పురోగతిని, నాణ్యతా ప్రమాణాల అమలును సమీక్షించారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర లభించేలా, కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఆయన వెంట ఆర్‌డిఒ కృష్ణమూర్తి, తహశీల్దార్ ఆర్.అప్పలరాజు ఉన్నారు.

పరిశీలిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనిత

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనిత

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నేరమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత స్పష్టం చేశారు. పి.సి.పి.ఎన్.డి.టి చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లింగ ఆధారిత హింస నివారణ, మెడికో లీగల్ కేర్ అందించడంపై జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మెడికో లీగల్ కేసుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆస్పత్రులకు వచ్చే అటువంటి కేసులకు వెంటనే కన్సెంట్ ఫారమ్ పూర్తి చేయించి, వారికి ఉచిత చికిత్స అందించి, కేసు వివరాలను పోలీసులకు తెలియజేయాలన్నారు. హింసకు గురైన అనాథ పిల్లలను గుర్తించి, వారిని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు.

డిసిహెచ్ఎస్ కళ్యాణ్ బాబు మాట్లాడుతూ మహిళలకు విద్య, ఆర్థిక స్వతంత్రత, సామాజిక గౌరవం, చట్టపరమైన రక్షణ అందించాలన్నారు. విశ్రాంత జడ్జి పప్పల జగన్నాథం మెడికో లీగల్, పోక్సో, పి.సి.పి.ఎన్.డి.టి చట్టాలను వివరించారు. రిమ్స్ మానసిక వైద్య నిపుణులు రమ్య, దీపక్ గృహహింస, లైంగిక వేధింపులు, సైబర్ వేధింపులు, మానసిక హింస తదితర అంశాలపై చర్చించి, బాధితులకు కౌన్సిలింగ్, మానసిక సహాయం అందించాల్సిన ప్రాముఖ్యతను వివరించారు. శిక్షణా కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ మేరీ కేథరిన్, అడిషనల్ డిఎంహెచ్ఒ తాడేల శ్రీకాంత్, డిఐఒ రామదాసు, సామాజిక వేత్త మంతెన వెంకటస్వామి, ప్రోగ్రామ్ అధికారులు శివరంజని, రవీంద్ర, సుజాత పాల్గొన్నారు.

మహారాజ శ్రీ సోంపేటసీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
H.M.O.P 71/2023

తంగుడు హరిక్రిష్ణ
మరియు ....పిటీషనర్
తంగుడు కవిత @ పొట్నూరు కవిత
....రెస్పాండెంట్

To,
తంగుడు కవిత @ పొట్నూరు కవిత, W/o హరిక్రిష్ణ, వయస్సు 33 సం.లు, గృహిణి, డోర్. నెం: 185, స్ట్రీట్ నెం. 321, మంగువాడి తోట, సంపత వినాయక టెంపులు దగ్గర, దుంప చిన్నబాబు గారి ఇళ్ళు, శ్రీకాకుళం, శ్రీకాకుళం జిల్లా.

ప్రకటన

పై నెంబరు H.M.O.P.71/2023 పిటిషన్‌లో పైన తెల్పిన రెస్పాండెంట్ అయిన మీ హాజరు కొరుకు కోర్టు మరియు రిజిస్టర్ పోస్టు ద్వారా నోటీసులు పలుమార్లు పంపిననూ పుచ్చుకోనకుండా ఉద్దేశ్యపూర్వకంగా తప్పించుకు తిరుగుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు కొరకు **తే.15-12-2025 దికి వాయిదా వేసి ఈ పేపర్ ప్రకటన మూలంగా నోటీసులు జారీ చేసియున్నారు.** అందువలన ఈ ప్రకటన మూలంగా తెలియజేయునది ఏమనగా పై తెలిపిన తేదిన పై కోర్టునందు **ఉదయం 10-30 గంటలకు** స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొవలెను, లేని పక్షంన కోర్టువారు ఎటువంటి ఆక్షేపణలు లేవని భావించి మీకు పరోక్షంగా పిటిషన్ తీర్మానించబడునని తెలియ జేయుచున్నాం.

(శ్రీ కోర్టువారి అనుమతితో...)

జి.ఎస్. శైలేంద్ర, ఆడ్వకేట్,
సోంపేట, శ్రీకాకుళం జిల్లా.

జంగాలపాడులో నిరసన తెలియజేస్తున్న గిరిజన నాయకులు

థర్మల్ ప్లాంట్ మాకొద్దు

ప్రజాశక్తి - బూర్జ

థర్మల్ పవర్ ప్లాంట్ ప్రతిపాదనను తాము పోరాటాన్ని కొనసాగిస్తామని థర్మల్ పవర్ ప్లాంట్ వ్యతిరేక కమిటీ నాయకులు సురేష్ దొర, సింహాచలం స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని అన్నంపేట పంచాయతీ పరిధిలోని జంగాలపాడు గిరిజన గ్రామంలో థర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు నిరసనగా దగ్ధం చేశారు. ఎవరు ఎన్ని బత్తిళ్లు తెచ్చినా, అడ్డంకులు ఎదురైనా తాము వెనుకాడబోమని తెలిపారు. ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం కార్పొరేటర్ సంస్థలకు కొమ్ముకాసేందుకు స్వార్థపూరిత ఆలోచనలతో థర్మల్ పవర్‌ప్లాంట్‌ను ఈ ప్రాంతంలో ఏర్పాటుకు పూనుకుందన్నారు. దీనివలన గిరిజనుల మనుగడకు ముప్పు కలుగుతుందన్నారు. మోసపూరిత మాటలతో మమ్మల్ని మాయ చేయలేరని, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం పూర్తిస్థాయిలో పునరాలోచన చేసి పవర్ ప్లాంట్ ప్రతిపాదనను వెనక్కు తీసుకునేంత వరకు పోరాటం ఉధృతం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సవర లక్ష్మణరావు, సవర నాగేశ్వరరావు, రామలింగం, మనోజ్, కూర్మారావు, మిన్నారావుతో పాటు మహిళలు పాల్గొన్నారు. ప్రభుత్వం తక్షణమే ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు.

ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

కంచిలి: కంచిలి మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.బాబూరావు, మురళీప్రకాష్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు సుదర్శన్ బెహరాల ఆధ్వర్యాన నిర్వహించారు. సంఘ గౌరవాధ్యక్షునిగా త్రినాథ్‌సాహు, నూతన అధ్యక్షునిగా మురళీనాయక్, ప్రధాన కార్యదర్శిగా పి.లక్ష్మణరావు, కోశాధికారిగా కృష్ణకుమార్, సహాధ్యక్షునిగా ఎస్.హేమసుందర్, కె.జీవనజ్యోతి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా నిరంజన్ బెహరాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితోపాటు పది మంది మండల కార్యదర్శులను, ఎనిమిది మంది జిల్లా కౌన్సిలర్లను ఎన్నుకున్నారు. వీరంతా తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తామంటూ ప్రమాణం చేశారు.

21న రెవెన్యూ సర్వీసుల సంఘం ఎన్నిక

శ్రీకాకుళం : ఈ నెల 21న ఏపి రెవెన్యూ సర్వీసుల సంఘం ఎన్నిక నిర్వహిస్తున్నట్టు ఏపిఆర్‌ఎస్‌ఎ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కలెక్టరేట్, శ్రీకాకుళం, టెక్కలి, పలాస డివిజన్ల యూనిట్లకు మూడేళ్ల కాల పరిమితి బుధవారంతో ముగిసిందన్నారు. 2025- 28 సంవత్సరాలకు గాను నూతన కార్యవర్గం ఎన్నికుంటామని తెలిపారు. సదరు నోటిఫికేషన్ కాపీతో పాటు డ్రాఫ్ట్ ఓటరు జాబితానూ ప్రచురించామన్నారు.

ప్రముఖ ఆలయాల జాబితా సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలోని ప్రముఖ ఆలయాల జాబితాను వారం రోజుల్లో సిద్ధం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ దేవాదాయ శాఖ ఇఒలను ఆదేశించారు. కలెక్టర్ బంగ్లాలో జాతరపై బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాదాయ శాఖ ఇఒ పరిధిలో ఉన్న ఆలయాలు ఎన్ని, వాటి చరిత్ర, పురాతనం నుంచి వస్తున్న జాతర చరిత్రలను సిద్ధం చేసి జాబితా అందజేయాలన్నారు. పలు ప్రాంతాల నుంచి రథసప్తమికి వచ్చే సందర్శకులు జిల్లాలో ప్రముఖ క్షేత్రాల సందర్శనకు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో దేవాదాయ శాఖ ఇఒలు, పర్యాటక అధికారి తదితరులు పాల్గొన్నారు.

ఉలిక్కిపడిన బూర్జ

బూర్జ: మండల కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి ప్రభుత్వ కార్యాలయాలకు కూతవేటు దూరంలో హోటల్ నడుపుతున్న వ్యక్తి ఇంట్లో భారీ చోరీ జరగడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. మండల కేంద్రంలో ఉన్న ఎంపిడిఒ కార్యాలయంలో అడపాదడపా చిన్నచిన్న చోరీలు జరిగాయి. అప్పుడప్పుడు వ్యవసాయ పరికరాలు చోరీకి గురయ్యాయని గ్రామస్తులు వాపోతున్నారు. మండల కేంద్రంలో భారీస్థాయిలో చోరీ జరగడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మకూడదో తెలియని పరిస్థితి నెలకొందని, ఎప్పుడూ ఎక్కడ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితులు ఉన్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అయితే అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని, దూర ప్రాంతాలకు, ఇతర గ్రామాలకు వెళ్లేవారు ముందుగా స్టేషన్‌కు తెలియజేయాలని ఎస్ఐ ప్రవళ్లిక తెలిపారు. ఏదిఏమైనా వ్యక్తిగత జాగ్రత్తలు అవసరమని, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని తగు సూచనలు చేశారు.

ఆలయ నిర్మాణానికి నిధుల మంజూరు

సరుబుజ్జిలి: మండలంలోని తెలికిపెంటలో రామాలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేసినట్లు జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు నందివాడ గోవిందరావు తెలిపారు. తమ గ్రామంలో రామాలయ నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను సర్పంచ్ నందివాడ రాజ్యలక్ష్మి, గ్రామస్తులు కోరగా ఎమ్మెల్యే రవికుమార్ కృషితో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలికి పెంటలో రామాలయ నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేసినట్లు దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. జికె వలస, మునగవలస, కోర్లకోట గ్రామాల్లోని ఆలయాలకు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ధూప దీప నైవేద్యాలకు నెలకు పదివేలు చొప్పున మంజూరు చేసారని తెలిపారు.

ఘనంగా వికలాంగుల దినోత్సవం

అరసవల్లి : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - అరసవల్లి

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద గల భవిత కేంద్రంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఇఒ ఆర్. విజయ కుమారి పాల్గొని మాట్లాడుతూ వికలాంగ పిల్లలకు ప్రభుత్వాలు కల్పిస్తున్న చట్టాలపై అవగాహన కలిగించుకొని వారికి అందాల్సిన సౌకర్యాలు అందించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం ముందుకు రావాలన్నారు. ఈ పిల్లల కోసం ఏర్పాటు చేసిన భవిత కేంద్రంలో చేర్పించి, భవిత కేంద్రంలో ఇస్తున్న సేవలను వినియోగించుకోవాలని కోరారు. జిల్లా సహిత విద్య ఉప సమన్వయకర్త వెలమల ఉమ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లల కోసం సమగ్ర శిక్ష ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని, వాటిని ఉపయోగించుకొని అత్యున్నత స్థానానికి వెళ్లేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఐఇఆర్‌పిలు యు.చెల్లమ్మ, బి.కుసుమకుమారి, ఎంఇఒలు పి. సుజాత, ఎన్.కృష్ణారావు, ఉపాధ్యాయులు సీతన్నాయుడు, యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలతో ర్యాలీ నిర్వహించారు.

పొందూరు: స్థానిక భవితా కేంద్రంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది సిడబ్ల్యుఎస్ఎన్ విద్యార్థులకు ఎంఇఒలు ఎం.వాగ్దేవి, పి.రాజారావుల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపిపిఎస్ హెచ్ఎం రాజేష్, ఐఇడి లక్ష్మణరావు, సహిత విద్య ఉపాధ్యాయులు రమణ, రాధారాణి, వికలాంగుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని మండలంలోని జగన్నాథరాజపురం మండల పరిషత్ పాఠశాల ప్రాంగణంలో హెచ్ఎం జి.ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సహితా విద్య సమన్వయ కర్త బి.గోవిందరావు, ఎంఇఒ ఎ.త్రినాథ రావు, హైస్కూల్ హెచ్ఎం బి.రమణయ్య, వికలాంగ ప్రత్యేక ఉపాధ్యాయులు ఎం.బాలరాజు, ఎం.రూపాదేవి, ఇందిరా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పొందూరు : చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న ఎంఇవి వాగ్దేవి

కవిటి: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కవిటి మండల ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మండల అభివృద్ధి అధికారి ఎల్.త్రినాథరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు ధనుంజయ మజ్జి, సనపల రామకృష్ణ, హెచ్ఎంలు బి.వరలక్ష్మి, ఐఇఆర్‌పి ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాస్థాయి వికలాంగుల క్రీడల్లో ప్రతిభ కనబరిచిన పుష్య వరుణ్, బినాయకో బెహరా విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

మెళియాపుట్టి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో భవిత కేంద్రం ఆధ్వర్యాన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. సహిత ఉపాధ్యాయులు ఎస్.ఝాన్సీరాణి, పి.శివప్రసాద్ సమక్షంలో ఎంజిఆర్ సౌజన్యంతో 30 మంది వికలాంగ విద్యార్థులకు భోజన ప్లేట్లు, గ్లాసులు, గిన్నెలు, పలకలు, స్లేట్ పెన్సిల్స్, కేక్, స్వీట్లు మాజీ మండల టిడిపి అధ్యక్షులు మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖర్ రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 ఎం.పద్మనాభరావు, ప్రధానోపాధ్యాయులు డి.మహాలక్ష్మి, స్కూల్ కమిటీ చైర్మన్ బురగాన చిన్నబాబు, వైస్ చైర్మన్ అలచంద్ర స్వప్న, టిడిపి యూనిట్ బూత్ కమిటీ కో-కన్వీనర్ దుక్క శంకర్ రెడ్డి, వార్డు సభ్యులు గాలి రామారావు, గాలి రామకృష్ణ పాల్గొన్నారు.

కంచిలి : వికలాంగుల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత సమాజంలోని అందరిపై ఉందని ఆరో అదనపు జిల్లా జడ్జి కె.కిషోర్‌బాబు అన్నారు. స్థానిక సీతయ్య ఫౌండేషన్ నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో నిర్వహించిన జాతీయ వికలాంగుల దినోత్సవంలో పాల్గొన్నారు. వికలాంగులపై ప్రతిఒక్కరూ ఆదరణ చూపాలన్నారు. రాజ్యాంగం వారి కల్పించిన హక్కులను వారికి అందించాలి అన్నారు. ఎస్ఐ లవరాజు, న్యాయవాది మడ్డు సర్వేశ్వరరావు, నిర్వాహకులు మోహన్, రమేష్, గణేష్ పాల్గొన్నారు.

కంచిలి : మాట్లాడుతున్న జడ్జి కిషోర్‌బాబు

పలాస : పలాస కోర్టు జూనియర్ సివిల్ జడ్జి యు.మాధరి సూచనల మేరకు వికలాంగుల దినోత్సవం సందర్భంగా కాశీబుగ్గ రైల్వే స్టేషన్ వద్ద పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు మహమ్మద్ ఫయాజ్ అహ్మద్, సీనియర్ న్యాయవాది ఎస్.నాగేశ్వరరావు, న్యాయవాది చాపర దివ్యశ్రీ పాల్గొన్నారు.

నందిగాం : వికలాంగులను మనలో ఒకరిగా చూడాలని ఎంఇఒ జి.నరసింహ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.హేమలత, డిప్యూటీ ఎంపిడిఒ హరికృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కృష్ణమోహన్, ఐఇ ఆర్‌పిలు పినకాన రాణి, బమ్మిడి రామారావు, లక్ష్మి పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు జె.చిన్నవాడు, డి.అర్జునుడు, ప్రధానోపాధ్యాయులు ఎ.రామారావు, ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్.రాంబాబు, బి.భాస్కరరావు, బి.అచ్యుతరావు పాల్గొన్నారు.

నగదు అందిస్తున్న సభ్యులు

కలాం ఫౌండేషన్ ఔదార్యం

ప్రజాశక్తి - కవిటి

మండలంలోని శిలగాంకు చెందిన దుండంగి గంగారావు హృదయ సంబంధిత సమస్యతో ఇటీవల ఆపరేషన్ చేయించుకున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన గంగారావుకు వైద్య ఖర్చులు భారంగా మారాయి. ఈ నేపథ్యంలో గంగారావు బాధను గుర్తించిన డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ఫౌండేషన్ బుధవారం అతని ఇంటికి చేరుకొని రూ.పది వేలు ఆర్థిక సహాయాన్ని అందజేసింది. అనంతరం సభ్యులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం ఫౌండేషన్ లక్ష్యమని, భవిష్యత్‌లో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.

నగదు అందజేస్తున్న మృత్యుంజయరావు

విద్యార్థులకు చేయూత

ప్రజాశక్తి - కంచిలి

మండలంలోని మకరాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతి పరీక్షలు రాసి అత్యధిక మార్కులు సాధించిన మొదటి ముగ్గురు విద్యార్థులకు వైసిపి మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుం జయరావు బుధవారం నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. పాఠశాల హెచ్ఎం సిహెచ్.అప్పలరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మొదటి స్థానం పొందిన కోరికాన మౌనికకి రూ.ఐదు వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వజ్జ అన్వేష్‌కి రూ.3 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన కోరికను లాస్యకు రూ.2 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా మరింత మందిలో బాగా చదవాలని ఆకాంక్షను కలిగించాలనే ఉద్దేశంతో ఈ ప్రోత్సాహకాలను అందజేసినట్లు తెలిపారు. దాతల సహకారం ఉంటే ప్రభుత్వ పాఠశా లలో విద్యార్థులు మరింత రాణిస్తారని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ఎస్.అప్పారావు, వి.ప్రకాష్, వి.త్యాగరాజు, బి.ఆనందరావు, జి.వెంకటరమణ, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

ప్రతి హామీ నెరవేరుస్తాం

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా కొత్తపేటలో 60 కిలో లీటర్ల సామర్థ్యం గల నీటి ట్యాంకును రూ.64.30 లక్షలు, దిబ్బవానిపేటలో 20 కిలో లీటర్ల సామర్థ్యం గల నీటి ట్యాంకును రూ.33.60 లక్షలు, కొమరల్తాడలో 60 కిలో లీటర్ల సామర్థ్యం గల నీటి ట్యాంకును రూ.97.90 లక్షల వ్యయాలతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ నిధులతో దేవునల్తాడ నుంచి కొత్తపేట రైతు సేవాకేంద్రం వరకు రూ.1.10 కోట్లు వ్యయంతో తారు రోడ్డు, సుంకర జగన్నాథపురం ఉద్దానం రాయిపాడుకు రూ.85 లక్షలతో తారు రోడ్డు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గాడ అఖిల్, గోవింద పాపారావు, కణితి సురేష్, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, దున్న షణ్ముఖారావు, చింత నారాయణ, దుర్రి నారాయణస్వామి, రఘు, తులె అప్పోజీ, వరదరాజులు, కొనారి కిరణ్, శశిభూషణ్ పాల్గొన్నారు.

'చింతాడ'పై టిడిపి నాయకుల ఫిర్యాదు

ఆమదాలవలస: వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్‌పై మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మహిళలు, మండల టిడిపి నాయకులు పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర పియుసి చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై వైసిపి సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఇటీవల చేసిన నిరాధార వ్యక్తిగత ఆరోపణలు ఆయన వ్యక్తిగత పర్యటనపై చేసిన తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. చింతాడ నిరంతరం ఎమ్మెల్యే రవి కుమార్‌పై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ ప్రెస్‌మీట్ పేరుతో అసత్యాలను వ్యాప్తి చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు నూక రాజు, నారాయణ పురం ఆనకట్టు చైర్మన్ సనపల ఢిల్లేశ్వరరావు, మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, టిడిపి నాయకులు సంపదరావు మురళి, బోర గోవిందరావు, ఇంజరాపు విశ్వనాధం, నాగళ్ల మురళీధర్ యాదవ్, దవళ అప్పలనాయుడు, బి.వి.రమణమూర్తి, రీసు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం

పొందూరు: కుక్కలదాడిలో గొర్రెలు, మేకలు మృతితో తీవ్రంగా నష్టపోయిన సంబంధిత రైతులను కూటమి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ అన్నారు. మండలంలోని కొంచాడలో బాధిత కుటుంబాలను బుధవారం ఆయన పరామర్శించి మాట్లాడుతూ ప్రభుత్వపరంగా అందించాల్సిన అన్నిరకాల సాయాన్ని అందించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం తక్షణ సాయంగా బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈయనతో పాటు జిల్లా సంయుక్త కార్యదర్శులు కొంచాడ చిన్నంనాయుడు, చిట్టి భాస్కరరావు, జిల్లా నాయకులు ముంగి జగదీష్, బొట్ట శంకర్ యాదవ్, జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు గార బాబూరావు, జనసేన నాయకులు కొంచాడ సిమ్మినాయుడు, శివ, రాము, బాలు , రమణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం అందజేస్తున్న చంద్రమోహన్

దరఖాస్తుల ఆహ్వానం

కవిటి: మండలంలోని జిల్లా పరిషత్ ఒడియా ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఏడు విద్యా బోధకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మండల విద్యాశాఖ అధికారులు ధనంజయ మజ్జి, సనపల రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఏడాదికి సంబంధించి 5 నెలల తాత్కాలిక ప్రాతిపదికన ఈ ఖాళీలు భర్తీ చేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు 3.12.25 నుంచి 5.12.25 తేదీలోగా స్థానిక ఎంఆర్‌సిలో తమ దరఖాస్తు అందజేయాలని సూచించారు.

ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు ప్రారంభం

కొత్తూరు: మండలంలోని కుంటిభద్ర, మహర్తాపురం గ్రామాల్లో వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రత్యేక జాతీయ సేవా పథకంలో భాగంగా ప్రారంభించిన సేవా కార్యక్రమాలను ప్రిన్సిపాల్ జి.కృష్ణారావు బుధవారం ప్రారంభించారు. విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి వివిధ సామాజిక అంశాలు, గృహ సర్వే చేశారు. సర్పంచ్ నాసా బాలకృష్ణ, పిఇఎస్ జి.మహేష్, కె.హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన ఉండాలి

మందస: మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండలంలోని మకరజోల, అంబుగాంబోడ్డూరు, వీరభద్ర, హరిపురం, ముకుందాపురం, బిన్నాలమదనాపురం గ్రామాల్లో వీధి వీధినా మహిళా సంఘాలు ముమ్మరంగా సమావేశాలు బుధవారం నిర్వహించారు. పొదుపులు, వాడుకున్న అప్పులు, ఇంటర్నల్ లెండింగ్ సంఘానికి వచ్చిన వడ్డీలు, ప్రభుత్వం ద్వారా వివిధ స్థాయిలలో వచ్చిన రాయితీలు, తదితర అన్ని విధాలైన సంఘం ఆర్థిక లావాదేవీలను చర్చించి రికార్డుల్లో నమోదు చేసుకోవాలన్నారు. గ్రామ సంఘాల ప్రతినిధులు, స్వయంశక్తి సంఘ లీడర్లు, సభ్యులు, విఒఎలు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : ప్రమాణ స్వీకారం చేస్తున్న సంఘ నాయకులు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ ఎన్నికలో మండల అధ్యక్షునిగా సంపతరావు మోహనరావు, కార్యదర్శిగా రత్నాకర్‌ను ఏకగ్రీవంగా బుధవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం అధ్యక్షతన అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ అధికారి రాయి వేణుగోపాల్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పూజారి జానికిరామయ్య ఎన్నికలు అధికారులు వ్యవహరించారు. ట్రెజరర్‌గా కె.ఉదయరేఖ, అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.రమేష్, వైస్ ప్రెసిడెంట్ పి.సోమేశ్వరరావు, పి.వాసు, బి.తిరుపతిరావు, జాయింట్ సెక్రటరీగా కె.శివకుమార్, వై.వనజాక్షి, కె.సంధ్య, ఉమెన్ అభ్యర్థిగా టి.సంధ్యారాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సాయిరాం మాట్లాడుతూ ఉద్యోగులు తమ ఎదుర్కొంటున్న సమస్యలు సాధనకు సంఘటితంగా పోరాటం చేయాలన్నారు. ఉద్యమంలో స్త్రీల పాత్ర చాలా కీలకమైనదని, మహిళా ఉద్యోగులూ చురుగ్గా పాల్గొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సంఘ నాయకులు కె.జయరావు, సచివాలయ ప్రతినిధి కె.సత్యనారాయణ, పలాస అధ్యక్షులు బోనెల గోపాల్, ప్రదీప్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జిఒల ఎన్నిక ఏకగ్రీవం

కోటబొమ్మాళి: పాత కోటబొమ్మాళి తాలుకా జలుమూరు, కోటబొమ్మాళి మండలాల ఎపిఎన్‌జిఒల సంఘం ఎన్నిక ఏకగ్రీవమైంది. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో అధ్యక్షునిగా ఎన్.రామారావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కరజాన ప్రవీన్ కుమార్, ఉపాధ్యక్షునిగా వి.శంకరరావు, బి.నరేష్, ఎస్.గోవిందరావు, కార్యదర్శిగా కె.వి. రాజేష్‌బాబు, జాయింట్ సెక్రటరీలుగా ఎ.సత్యరాజు, జి.ఈశ్వరరావు, పి.వెంకటేష్, డి.పద్మావతి, టెజరరీగా పి.ఎన్.రెడ్డిలు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా డి.రాజకుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, చల్ల శ్రీనివాస్, ఆర్.వేణుగోపాల్, కె.జయరాం, డి.రాజేష్‌కుమార్, రాధాకృష్ణ, శ్రీనివాసరావు, రత్నాకుమారి, కె.వి. సత్యనారాయణ పాల్గొనగా ఎన్నికైన వారితో ప్రమాణస్వీకారం చేయించారు. మండల పరిషత్ పరిపాలనాధికారి నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : ఎన్నికైన సంఘ నాయకులు

మాట్లాడుతున్న అన్వేష్

ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఆంధ్ర బాప్టిస్టు చర్చి అధ్యక్షులు ప్రత్తి విజయ్ కుమార్ స్వగృహంలో బుధవారం ఘనంగా ఫ్యామిలీ క్రిస్టమస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలో పాస్టర్స్ కుటుంబాలు పెద్దలు భారీగా పాల్గొన్నారు. రాజమండ్రి నుంచి దైవ సేవకులు పాస్టర్ సంతోష్ రెడ్డి క్రిస్మస్ వర్తమానం అందించారు. రెవ. యువిజాన్ సన్, ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి, సభ అధ్యక్షులుగా నిర్వహించారు. మొదటి పలుకులు ప్రత్తి విజయ కుమార్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ప్రత్తి అన్వేష్ ప్రసంగించారు. కార్యక్రమంలో కొత్తపల్లి అబ్రహం, ప్రకాశ్‌బాబు, హెబ్రోన్ మిషన్ స్కూల్ డైరెక్టర్ జాన్ వెస్లీ, రెవ. అప్పాజీ, బెనర్జీ పాల్గొన్నారు. దైవ సేవకులు కుటుంబాలకు క్రిస్మస్ బహుమతులు అందించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కటింగ్, క్యాండిల్ సర్వీస్‌తో క్రిస్మస్ పాటలతో ఘనంగా ముగించారు.

మాటిచ్చారు.. పనిచేశారు

ప్రజాశక్తి - కవిటి

నిత్యం గుంతల రహదారిలో తిరుగుతూ తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రగడపుట్టుగ రైతులు, గ్రామస్తులకు కొంత ఉపసమనం లభించింది. నవంబర్ 8న గుంతల రహదారి పరిశీలించిన మేజర్ పంచాయతీ సర్పంచ్ పూడి లక్ష్మణరావు ఆ ప్రాంతంలో తుప్పలు తొలగించి గోతులు కప్పిస్తానని స్థానిక రైతులకు మాటిచ్చారు. చెప్పి నట్టుగానే నవంబరు 14న జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. అనంతరం గుంతలు పూడ్చేందుకు అవసరమైన కంకర తెప్పించారు. చెప్పినట్టుగానే గుంతలు పూడ్చి రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. దీంతో మండలంలోని ప్రగడపుట్టుగ నుంచి జల్లుపుట్టుగ, ఈదుపురం, ఇచ్ఛాపురం వెళ్లే వారితో పాటు నిత్యం ఆ మార్గంలో తిరిగాడే రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇదే చొరవతో తమకు శాశ్వత రహదారి ఏర్పాటు చేయాలని కోరారు.



గుంతలు కప్పిన రహదారి



అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

కంపు కొడుతున్న మరుగుదొడ్లు

అరసవల్లి: జిల్లా కేంద్రంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద అధ్వాన్న పరిస్థితులు ఉన్నాయి. ఆర్‌టిసి కాంప్లెక్స్ బయట ఉన్న మరుగుదొడ్లు దుర్వాసనతో ఆ మరుగుదొడ్లలోకి వెళ్లలేని పరిస్థితి ఎదురవుతుంది. మరుగుదొడ్ల వద్ద నీరు నిలిచిపోయి, ఈగలు, దోమలతో, వెళ్లలేని పరిస్థితి ఉంది. పురుషులు మరుగుదొడ్ల వద్ద లోపలికి వెళ్లలేక ఆరుబయటే మూత్ర విసర్జన చేయాల్సిన పరిస్థితి ఎదురైంది. మరుగుదొడ్ల వద్ద ఉన్న కాలువ నిర్మాణం పనులు సగంలో ఆగిపోవడం వలన మూత్ర విసర్జన చేయడానికి కాలువ దాటడానికి సర్కస్ ఫీట్లు చేయాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. ఎన్నాళ్ళ నుంచో ఈ కాల్వ పరిస్థితి ఇలాగే ఉంది. ఆర్‌టిసి ఇంజినీరింగ్ అధికారులు ఈ మరుగుదొడ్లపై శ్రద్ధ చూపకపోవడం వలన అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

వృద్ధురాలు పార్వతమ్మ మృతదేహం

బంగారం కోసమే వృద్ధురాలి హత్య

ప్రజాశక్తి - లావేరు

చెవి, ముక్కులో ఉన్న బంగారం కోసం ఓ వృద్ధురాలను గుర్తు తెలియని దుండగులు కిరాతకంగా హత్య చేశారు. చంపేసిన అనంతరం మృతదేహాన్ని కాల్చేందుకు ప్రయత్నించగా స్థానికులు అలజడి వినిపించడంతో వడ్డి పార్వతమ్మ (65)ను బావిలో పడేసి అక్కడి నుంచి పరారైయ్యారు. ఘటనాస్థలంలో వృద్ధురాలకు, దుండగుల మధ్య పెనుగులాట జరిగింది. సంఘటన స్థలంలో మృతురాలకు సంబంధించి గాజులు, చెప్పులు, తల సవరం లభించాయి. వీటి ఆధారం మంగళవారం పోలీసులు గాలించారు. రెండున్నర తులాల బంగారం కోసం ఓ నిండుప్రాణాన్ని బలితీసుకున్న ఘటన లావేరు మండలం మురపాకలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఈ నెల 1న గ్రామానికి సమీపంలో ఉన్న తమ కల్లానికి పశువులు మేపేందుకు వెళ్లిన పార్వతమ్మ తిరిగి ఇంటికి రాలేదు. కల్లానికి వెళ్లిన వృద్ధురాలు కనిపించకపోడంతో ఆరోజాంతా కుటుంబసభ్యులు వెతినప్పటికీ ఆచూకీ లభించలేదు. 2వ తేదీన పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు, క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ బృందాలు పరిసర ప్రాంతాల్లో రాత్రివరకు వెతికినప్పటికీ పార్వతమ్మ ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం కల్లానికి సమీపంలో ఉన్న రెండు నేలబావుల్లో వెతకగా ఓ పాడుబడిన బావిలో మృతదేహం కనిపించింది. ఘటనాస్థలానికి పోలీసులు, రణస్థలం అగ్నిమాపక సిబ్బంది చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు. పార్వతమ్మ ముక్కు, చెవులు కోసి బంగారం అపహరించారు. దీంతో పాటు తల వెంట్రుకులు, చీర కాలిపోయి ఉన్నాయి. దీని ఆధారంగా చంపేసిన అనంతరం మృతదేహానికి నిప్పంటించి మృతదేహాన్ని బావిలో పడేసి దుండగులు పరారైనట్లు పోలీసులు ఓ నిర్ధారణకు వచ్చారు. పార్వతమ్మను దారుణంగా హత్యచేయడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో ఇలాంటి హత్య మునుపెన్నడూ జరగలేదని స్థానికులు చెబుతున్నారు. బంగారం కోసం తన తల్లిని కిరాతకంగా హత్య చేయడంపై కుమారులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఘటనాస్థలాన్ని జెఆర్ పురం ఇన్‌ఛార్జి సిఐ (ప్రస్తుతం ఆమదాలవలస సిఐ) సత్యన్నారాయణ పరిశీలించారు. కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. మృతురాలు కుమారుడు లక్ష్మణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యకేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని లావేరు ఎస్ఐ కె.అప్పలసూరి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించడం జరిగిందన్నారు.

మృతి చెందిన తులసీరత్నం

వివాహిత అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

శ్రీకాకుళం నగరంలోని ఎఎస్ఎన్ కాలనీకి చెందిన గురుగుబెల్లి తులసీరత్నం (43) అనే వివాహిత హత్యకు గురైంది. ఎచ్చెర్ల పోలీసుల వివరాల మేరకు పొందూరు

క్రైమ్ కార్నర్

మండలం పిల్లలవలస గ్రామానికి చెందిన తులసీరత్నంకు ఆమదాలవలస మండలం కొత్తవలస గ్రామానికి చెందిన కూర్మారావుతో వివాహమైంది. వీరు శ్రీకాకుళం నగరం ఎఎస్ఎన్ కాలనీలో 14 ఏళ్ల నుంచి అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. ఈమె భర్త కూర్మారావు ఫినాయిల్ వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురై ఇంటి వద్దే ఉంటున్నాడు. అయితే మృతురాలు చర్మవ్యాధి వైద్యులను సంప్రదించేందుకు మంగళవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో డాక్టర్ వద్దకు వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రి 8.30 గంటల వరకు వరకూ ఈమె ఇంటికి రాకపోవటంతో ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వచ్చింది. ఎన్నిసార్లు చేసినా ఇదేవిధంగా స్విచ్‌ఆఫ్ రావటంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, బంధువులను సంప్రదించారు. ఎవరి నుంచి ఆచూకీ లేకపోవటంతో శ్రీకాకుళం టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు కుమారుడు వెంకటరమణ సమాచారం ఇచ్చాడు. ఇది ఇలా ఉండగా ఈమె మృతదేహం బుధవారం ఉదయం ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట సమీపంలో జాతీయరహదారి సర్వీసురోడ్డు ప్రక్కన పడి ఉంది. స్థానికులు మృతదేహాన్ని గమనించి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఎచ్చెర్ల, రణస్థలం, జి.సిగడాం ఎస్ఐలు జి.లక్ష్మణరావు, ఎం.చిరంజీవి, వి.సందీప్ కుమార్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు ఆరా తీశారు. ఉదయం క్లూస్‌టీం, డాగ్‌స్వాడ్ సంఘటనా స్థలం వద్దకు వచ్చి ఆధారాలు సేకరించారు. జాగిలం శ్రీకాకుళం వెళ్లే రోడ్డులో కింతలిమిళు కూడళి వరకూ వెళ్లి ఆగింది. మృతురాలి మెడపై తాడుతో బలంగా బిగించి హత్య చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. పోలీసులు శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి మృతదేహాన్ని తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుమారుడు వెంకటరమణ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి పోలీసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

క్రీడలతో ఆరోగ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

క్రీడల ద్వారా ఆరోగ్యంతో పాటు, శారీరక దారుఢ్యం మెరుగుపడుతుందని భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వశాఖ మేర యువ భారత్ డిడి కె.వెంకట్ ఉజ్వల్ అన్నారు. కోడి రామ్మూర్తి స్టేడియంలో బుధవారం జిల్లా యువతకు క్రీడా పోటీలు నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్లర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న యువజన సర్వీసులశాఖ సెట్శ్రీ సిఇఒ వి.వి.అప్పలనాయుడు పాల్గొని క్రీడా పోటీలు ప్రారంభించారు. బహుమతి ప్రదాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ఉపాధి కల్పన అధికారిణి కె.సుధ మాట్లాడారు. ప్రతిఒక్కరూ క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. సామర్థ్యాలను మెరుగుపరచుకుంటూ విజయ బావుటాను ఎగురవేయాలన్నారు. క్రీడా పోటీలు అంటే శారీరక శ్రమ, నైపుణ్యాలు కలిగిన వ్యవస్థీకృత పోటీలు వినోదాన్ని అందిస్తాయని తెలిపారు. క్రీడాకారులకు ఆనందాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటకశాఖ అధికారి ఎన్.నారాయణరావు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్, మేరా యువ భారత్ గణంకాధికారి, కార్యక్రమ సహాయకులు డి.శ్రీనివాసరావు, క్రీడా కోచ్‌లు మణి, సింహాచలం, హరి, మేరా యువ భారత్ వాలంటీర్స్ అరుగుల దిలీప్‌కుమార్, మట్ట ప్రియాంక, మౌనిక, కొయ్యాన మధు, బాలాజీ, యూత్ లీడర్స్ గుజ్జల ఉమామహేశ్వరరావు, రౌతు సుమతి, మోహనరావు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల సందర్శన

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మద్రాస్ ఐఐటి కెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ రాజ్‌కుమార్ బల్ల సందర్శించారు. మద్రాస్ ఐఐటి ప్రొఫెసర్ డాక్టర్ రాజకుమార్ బల్ల ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి, విద్యార్థులను ఉద్దేశించి పలు సూచనలు చేశారు. ఐఐటిల్లో చదివితే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ ఎలా ఉంటుందో తన ప్రసంగంలో తెలిపారు. ఈ కళాశాల నుంచి ఐఐటిల్లో షీట్‌లు సాధించిన ముగ్గురు విద్యార్థులు గుడియా జ్యోతి, బాకీ ఈశ్వరి, పూజిత బాధిత్యలను అభినందించారు. దీనికి కృషి చేసిన కెమిస్ట్రీ లెక్చరర్ శివకుమార్‌ను అభినందించారు. భవిష్యత్‌లో ఈ కళాశాల నుంచి అధిక సంఖ్యలో ఐఐటిల్లో షీట్‌లు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ దుర్యోధన దోలాయి, అధ్యాపకులు సీతమ్మ, సంతోష్‌కుమార్, మోహనరావు, త్రిపాఠీ, శాంతా, ఈశ్వరరావు, రాధా, లోకేష్, బృందావనం, దేవరాజు, భగవతి పాల్గొన్నారు.

రైతన్నల శ్రేయస్సు కోసమే 'రైతన్నా మీకోసం'

పోలాకి : కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి అని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని దీర్ఘాసిలో 'రైతన్న - మీకోసం' కార్యక్రమానికి బుధవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా రైతుల ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు అందజేస్తుందని అన్నారు. వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూలస్థంభమని అన్నారు. తమ ప్రభుత్వం రైతు రాజ్య స్థాపనకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

కోటబొమ్మాళి: రైతన్నల శ్రేయస్సు కోసమే ప్రభుత్వం రైతన్న మీకోసం కార్యక్రమం తీసుకువచ్చిందని టెక్కలి ఎడిఎ కె.జగన్మోహన్‌రావు తెలిపారు. మండలంలోని హరిశ్చంద్రపురంలో ఆయన రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త కె.మధుకుమార్, ఎఒ ఎస్.గోవిందరావు, ఎంపిఇఒలు టి.లావణ్య, వి.కళ్యాణి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : డిమాండ్ ఉన్న పంటల మార్పిడితో రైతులకు అధిక ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. వజ్రపుకొత్తూరులో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ప్రారంభించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వజ్జ బాబూరావు, మల్ల శ్రీనివాసు, కణితి సురేష్, సూరాడ మోహన్, అరసవల్లి ఉమామహేశ్వరరావు, వ్యవసాయశాఖ ఎడి రామారావు,

పోలాకి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ఎఒ బమ్మిడి ధనంజయ, మెట్ట పాపారావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద రైతన్న మీకోసం కార్యక్రమాలు నిర్వహించామని ఎఒ అజయ్‌కుమార్ తెలిపారు. రబీ, ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు అవగాహన కల్పించామన్నారు. నీటి వినియోగం, ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం ప్రోత్సాహం, యంత్రాంగ వినియోగం, పంటల విలువ వృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక కార్యాచరణలను రూపొందించామన్నారు.

కంచిలి : రైతులు ఉద్యానవన పంటల వైపు మారాలని ఎఒ కె.సురేష్ రైతులను కోరారు. మండలంలోని కొల్లూరు రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతులతో వ్యవసాయ అనుబంధ రంగాల గురించి గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎఇఒ విద్యాసాగర్, ఐటిడిపి మండల అధ్యక్షుడు వాసాల రమేష్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, రామారావు, ప్రదీప్, ఈశ్వర్, లోకనాథం, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

సోంపేట : మండలంలోని బారువ, బారువపేట రైతు సేవా కేంద్రాల వల్ల ఎఒ బి.నర్సింహమూర్తి రైతన్న మీకోసం కార్యక్రమంలో నిర్వహించారు. వరి ఎద సాగు, అడవి పందుల నివారణ, వ్యవసాయ యాంత్రీకరణ, సౌర విద్యుత్ కంచెలు, నువ్వుసాగు, ప్రకృతి వ్యవసాయం అవశ్యకతపై వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి గుర్రాల శ్రీను, దున్న సత్యం, కర్రి సత్యం, లోట్ల శాంతారావు, ప్రకృతి వ్యవసాయం సామాన్య కర్త కుమారి, పశువైద్య సహాయకులు మల్లేష్, విఆర్ఒ భాగీరథి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని మెళియాపుట్టి, వసుంధరల్లో రైతన్న మీకోసం కార్యక్రమాల్లో పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, సర్పంచ్ సలాన అప్పలనాయుడు, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, ఎఎఒ ప్రభావతి, మాజీ ఉప సర్పంచ్ బసవ భాస్కర్‌రెడ్డి, ఎఎంసి డైరెక్టర్ చింతల ప్రశాంత్, సలాన వెంకటరావు పాల్గొన్నారు.

కొత్తూరు : మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు మాతల గాంధీ, టిడిపి మండల అధ్యక్షులు అగతముడి మాధవరావు, సర్పంచ్ పి.కృష్ణవేణి, ఎడి బి.రాజగోపాల్, అగతముడి అరుణ్‌కుమార్, చౌడవరపు రాము పాల్గొని రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు.

వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

ఆమదాలవలస: రైతుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని కొరపాంలో జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు, నారాయణపురం ఆనకట్టు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సనపల ఢిల్లేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షుడు నూక రాజు, గ్రామ వ్యవసాయ సహాయకులు గొండు ప్రశాంతి, మార్కెట్ కమిటీ, రెవెన్యూ, ఇంజనీరింగ్, విద్యుత్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

కోటబొమ్మాళి: మండలంలోని కొత్తపల్లి సబ్‌స్టేషన్ మరమ్మతులు సందర్భంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఇఇ నరసింహకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపల్లి, సరియాపల్లి, కురుడు, చౌదరి కొత్తూరు, దంత, నారాయణపురం, చిన్నసాన, పులిబంధ, రామ్మూర్తిపేట, కిడిమి, కిడిమిబుడితి, భద్రాచలం, జమచక్రం, మదనాపురం, జరాలి, సవరపేట గ్రామాలకు, అలాగే పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

పోలాకిలో నేడు...

పోలాకి: పిన్నింటిపేట సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎఇ నరసింహకుమార్ తెలిపారు. గుప్పిడుపేట, సుసరాం ఫీడర్లలో మరమ్మతులకు చేపడుతున్నామని తెలిపారు. పిన్నింటిపేట, ఆక్వా సర్వీసులు రైతులు, కోడూరు, మగతపాడు, గుప్పెడుపేట, చిన్నకోవూరిపేట, గొల్లవానిపేట, జోగంపేట, కొత్తరేవు, కోవిరిపేట, అక్కువరం, కంబాలవానిపేట, పరపతివానిపేట, డి.ఎల్.పురం, సత్రావుపేట, బెలమర పాలవలస, పిరియా, సుసరం గాథలవలస, బార్జిపాడు, రేగుపాడు, రెహమాన్‌పురం, బొద్దం, వానవిష్ణుపురం, ప్రకాశరావుపేట, చిన్నకోడూరు, ఆక్వా బెల్ట్‌కు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు.

పరిశుభ్రత లోపిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధిలోని హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు కచ్చితంగా పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ యజమానులకు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఆధ్వర్యాన పట్టణ పరిధిలోని టిఫిన్, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ మొదలగు తినుబండారాల షాపు యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో ప్రబలుతున్న డయేరియా వ్యాధి కేసులు కారణంగా పట్టణ పరిధిలోని అన్ని హోటళ్లు, టిఫిన్, ఫాస్ట్‌ఫుడ్ షాప్ యజమానులు తినుబండారాలు నిల్వ చేయరాదని అన్నారు. తినుబండారాలపై మూతలు వేయాలన్నారు. వేడి నీళ్లు వినియోగదారులకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర కుమార్, సచివాలయ పర్యావరణ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో పరిశుభ్రత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ సూచనలు మేరకు టిఫిన్ సెంటర్లు, డాబాలు, హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులతో సమీక్షా సమావేశం

ఆమదాలవలస : మాట్లాడుతున్న కమిషనర్ రవి

నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహార పదార్థాల నాణ్యత, నీటి సరఫరా, పరిశుభ్రతపై మార్గదర్శకాలు జారీ చేశారు. కార్యక్రమంలో హోటల్ యజమానులు, సచివాలయ వార్డు శానిటరీ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : నీటి, ఆహార పరిశుభ్రత, పారిశుధ్యంపై హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, సినిమా థియేటర్ల యజమానులతో యాజమాన్యాలతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎం.రేణుక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ కె.సింహాద్రి, ఎంఇఒలు దల్లి తులసీదాస్, ఐ.చిన్నారావు, కార్యదర్శి ఎం.వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్ సభ్యులు

మాదకద్రవ్యాల జోలికిపోవద్దు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మాదకద్రవ్యాలు వద్దు.. జీవితం ముద్దు అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, పోలీస్ శక్తి టీం సిబ్బంది భైరాగి, ధనలక్ష్మి, వాసుదేవ్ అన్నారు. మండలంలోని పూండిగోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల వాలంటర్లు, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన మూడో రోజు డ్రగ్స్‌పై బుధవారం ర్యాలీ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనంలో ఆల్కహాల్, డ్రగ్స్ అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకొని కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని అన్నారు. ఈ వయస్సులో మీరు శ్రద్ధగా చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ ఎస్.రూప్‌సుందర్, అధ్యాపకులు కేశవరావు, ఝాన్సీ, శోభ, భాగ్యలక్ష్మి, ఆలేఖ్య, సౌజన్య, వాణి, రమణ, పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎన్‌జిఒ నాయకులు

ఎమ్మెల్యేను కలిసిన ఎన్‌జిఒ నాయకులు

పలాస : ఇటీవల నూతనంగా ఎన్నికైన ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యే గౌతు శిరీషను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాశీబుగ్గ హైస్కూల్ రోడ్డులో అసంపూర్ణంగా ఉన్న ఎన్‌జిఒ హోమ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సాధ్యాసాధ్యాలు పరిశీలించి నిధులు విడుదల చేస్తామని సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో అధ్యక్షులు బోనెల గోపాల్, కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, అసోసియేషన్ ఉపాధ్యక్షులు పొట్నూరు శ్రీనివాసరావు, పంచాయతీ అధికారి పి.సద్గుణబాబు, మున్సిపల్ అధికారి ఉదయ్‌శంకర్ పాత్రో, ఐసిడిఎస్ అధికారి యు.లత, వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి కొర్ల కళ్యాణ్‌చక్రవర్తి పాల్గొన్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక అందజేత

బాధితులతో మాట్లాడుతున్న ఎడి రఘునాథ్

ప్రజాశక్తి- పొందూరు

మండలం కొంచాడలో మంగళవారం కుక్కలదాడిలో 40 గొర్రె పిల్లల మృతి చెందగా, 11 మేకలు, గొర్రె పిల్లలు తీవ్రంగా గాయపడ్డాయి. అయితే ఈ ఘటనకు సంబంధించిన నివేదికలను జిల్లా అధికారులకు అందజేసినట్లు పశుసంవర్ధకశాఖ ఎడి రఘునాథ్ తెలిపారు. బుధవారం కొంచాడలో కుక్కలదాడిలో మృతి చెందిన గొర్రెలతో పాటు తీవ్రంగా గాయపడిన గొర్రెలు, మేకల పరిస్థితిని ఆయన సమీక్షించారు. కుక్కల దాడిలో 40 గొర్రె పిల్లలు మృతి చెందగా మరో 11 మేకలు, గొర్రె పిల్లలు తీవ్రంగా గాయపడగా, వాటికి తగిన చికిత్సలు అందించి ప్రాణాపాయం నుంచి కాపాడడం జరిగిందన్నారు. న్యాయమైన పరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని, బాధిత రైతులు కురమాన రమణ, గౌరినాయుడులకు తెలిపారు. గ్రామంలో తరచూ జరుగుతున్న కుక్కల దాడులను దృష్టిలో ఉంచుకుని గొర్రెలు, మేకల రక్షణకు మినీ గోకులంలు ఏర్పాటు కోసం ప్రత్యేక ప్రతిపాదనలు సిద్ధం చేసే ప్రక్రియలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈయనతో పాటు డిప్యూటీ ఎంపిడిఒ పి.సింహాచలం, కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులున్నారు.

సందడిగా గ్రిగ్స్ పోటీలు

ప్రజాశక్తి- నందిగాం

76వ అంతర్ పాఠశాలల టెక్కలి నియోజకవర్గం గ్రిగ్స్ పోటీలు మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం కూడా కొనసాగాయి. రెండో రోజు బాలికల విభాగంలో కబాడ్డీ, వాలీబాల్, ఖోఖో తదితర పోటీలు నిర్వహించారు. సందడి వాతావరణం మధ్య నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు బహుమతులను మాజీ సర్పంచ్ మాదిన లోకనాథం, ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావులు అందజేశారు. కార్యక్రమంలో

కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

నియోజకవర్గ గ్రిగ్స్ పోటీల ఇన్‌ఛార్జి నాగళ్ల రమేష్, జోనల్ ఇన్‌ఛార్జి కుప్పిలి ప్రకాష్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ చమళ్ళ సీతారాం, మార్పు మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు కురమాన దాలయ్య, టి.తులసీప్రసాద్, నాగేశ్వరమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు యాగంటి త్రినాథరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- మెళియాపుట్టి

నరసన్నపేటలోని ఎస్ఎల్‌విడి కళ్యాణ మండపంలో అబాకస్ వేదిక మ్యాచ్ టీం జగదీష్, అప్పారావు ఆధ్వర్యాన జిల్లాస్థాయి అబాకస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నలంద పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరుస్తూ అద్భుత ఫలితాలు సాధించారు. విజిలేషన్ సీనియర్ విభాగంలో ఏడో తరగతి విద్యార్థిని భానుప్రియ జానం ప్రథమ స్థానం సాధించింది. విజిలేషన్ జూనియర్ విభాగంలో నాలుగో తరగతి విద్యార్థిని కృష్ణవేణి ప్రధాని మొదటి బహుమతి గెలుచుకుంది. అలాగే లిటిల్ ఛాంపియన్ అబాకస్ విభాగంలో రెండో తరగతి విద్యార్థి చెల్లి జోగారావు మొదటి స్థానం కైవసం చేసుకున్నాడు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రతాప్, ఉపాధ్యాయులు నమిత, శారద, నీలిమ పాల్గొని విద్యార్థులను అభినందించారు.

కోటబొమ్మాళి: నందిగాం మండలం లఖిదాసుపురంలో మంగళ, బుధవారాల్లో నిర్వహించిన

విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందనలు తెలుపుతున్న ప్రతాప్

76వ అంతర పాఠశాలల నియోజకవర్గస్థాయి గ్రిగ్స్ ఆటల పోటీల్లో జూనియర్ బాలికల కబడ్డీ విభాగంలో ప్రథమ స్థానం, జూనియర్ బాలుర ఖోఖో పోటీల్లో ద్వితీయ స్థానం, సీనియర్ బాలికల ఖోఖో పోటీలలో ద్వితీయ స్థానం సాధించారు. విద్యార్థుల ప్రతిభను పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.గోవిందరావు, వ్యాయామ ఉపాధ్యాయులు సిహెచ్.వాసుదేవరావు, వెంకటరావు, గణేష్, ఉపాధ్యాయ సిబ్బంది, ఎస్ఎంసి ఛైర్మన్ బోయిన వెంకటరమణ అభినందించారు.

కెజిబివి విద్యార్థుల ప్రతిభ

పొందూరు: మండలంలోని పిల్లలవలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల జరిగిన మండల స్థాయి గ్రిగ్స్ పోటీల్లో లోలుగు కెజిబివి విద్యార్థులు పలు విభాగాల్లో అద్భుత ప్రతిభను కనబరిచినట్లు బుధవారం ప్రిన్సిపాల్ సిహెచ్.లలితకుమారి తెలిపారు. సీనియర్ బాలికల విభాగంలో వాలీబాల్, బాడ్మింటన్ పోటీల్లో ప్రథమస్థానం, జూనియర్ విభాగంలో కబడ్డీ, బాడ్మింటన్, వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే ఖోఖో పోటీలో సీనియర్, జూనియర్ విభాగాల్లో ద్వితీయ స్థానంలో నిలిచారు. గ్రిగ్స్ పోటీల్లో ప్రతిభను కనబరిచిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ లలితకుమారి, పిఇటి ఎం.రూపవతి, ఎఎన్ఎం యోగీశ్వరి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఘనంగా రాజేంద్రప్రసాద్ జయంతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో మాజీ రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ డి.కృష్ణమూర్తిరెడ్డి రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజేంద్రప్రసాద్ భారతదేశం మొదటి రాష్ట్రపతి పనిచేశారని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కె.సి.పూరి, ఉపాధ్యాయులు రవి, పద్మజ,

చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కృష్ణమూర్తిరెడ్డి

రాజ్యలక్ష్మి, జయలక్ష్మి, ప్రమీల, పార్వతి, శిరీష, యువశ్రీ, జిహరిక, ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ మోహన్‌ప్రియ, సెక్రటరీ డి.హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

22న పాణిగ్రహి సంస్మరణ సభ

ప్రజాశక్తి- పలాస

ప్రజ కళాకారుడు, సాంస్కృతిక యోధుడు సుబ్బారావు పాణిగ్రహి సంస్మరణ సభ ఈ నెల 22న మండలంలోని బొడ్డపాడు అమరుల స్మారక భవనం వద్ద నిర్వహిస్తున్నామని ఆ సంఘ నాయకులు తెలిపారు. ఈ మేరకు బొడ్డపాడులోని పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షోభ కాలంలో కవిగా, రచయితగా, వాయిద్య కారుడిగా, పాటగాడిగా, ఆటగాడిగా, పోరాట వీరుడుగా విభిన్న పాత్రల పోషించిన సాంస్కృతిక యోధుడి సభను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా కళామండలి జిల్లా అధ్యక్షుడు రాపాక చిరంజీవిలు, సాలినా కుమార్, బుట్ట శ్రీరాములు, శ్రీకాంత్, ప్రజా కళా మండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి నీలకంఠం పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి- సోంపేట

స్థానిక దుర్గాదేవి ఆలయం వద్ద బుధవారం మోటార్ యూనియన్ సభ్యులకు సిఐ మంగరాజు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా వాహనాలకు సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ లవరాజు, మోటార్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వేడినీరు అందించాలి

కోటబొమ్మాళి: విద్యార్థులుత్రాగేందుకు వేడినీటిని మాత్రమే అందించాలని మండల విద్యాశాఖాధికారి డి.గోవిందరావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నారాయణరావులు అన్నారు. మండల కేంద్రంలోని జ్యోతిరావుపూలే బాలుర పాఠశాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెడుతున్న మెను, పాఠశాలలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించారు.

అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాసరావు

గీతాంజలి విద్యార్థుల ప్రభంజనం

నరసన్నపేట : విశ్వం ఎడ్యుటెక్ అబాకస్ సంస్థ ఎస్ఎల్‌విడి కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి అబాకస్ పోటీల్లో గీతాంజలి స్కూల్ - నరసన్నపేట విద్యార్థులు నేతింటి యక్షిత 5వ తరగతి ఛాంపియన్ ప్రథమ, టంకాల శ్రీవంత్ 5వ తరగతి బెస్ట్ పెరఫార్మర్ ద్వితీయ, అబాకస్ సీనియర్ లెవెల్-4లో బహుమతులు గెలుపొందారు. 29 మండలాల నుంచి 44 పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆర్.శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులు కె.వి.శివప్రసాద్, ప్రిన్సిపాల్ కె.కోటిబాబు, ఎం.ఎ.శాస్త్రి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విజేతలకు అభినందించారు.

వైద్య శిబిరం పరిశీలన

వజ్రపుకొత్తూరు : స్క్రబ్ టైపస్ డయేరియంపై ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష వైద్య సిబ్బందిని సూచించారు. కొత్తపేట సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని బుధవారం పరిశీలించారు. ప్రభుత్వ వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వాహిని ప్రియాంక, వినయ్ కుమార్ 53 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పూజారి కుటుంబానికి ఆర్థికసాయం

సోంపేట : పట్టణంలోని దగ్గు చెరువు గట్టు వీధికి చెందిన ఆలయ పూజారి సింహాచలం ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన లోకనాథేశ్వర కుట్టు పని సంక్షేమ సంఘం సభ్యులు కుటుంబానికి బుధవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు రూ.5,600 నగదు, 25 కేజీల బియ్యం ప్యాకెట్, కూరగాయలు అందజేశారు.

మరపురాని సేవలకు వందనం

కవిటి: కళ్యాణి ఆంగ్ల పాఠశాలలో బుధవారం బాబు రాజేంద్రప్రసాద్ జయంతి, మేజర్ ధ్యాన్‌చంద్ వర్ధంతి నిర్వహించారు. దేశానికి అపూర్వ సేవలు అందించిన ఇద్దరు మహనీయులను విద్యార్థులు స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఎఒ మాదిని రాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి

పత్రాలను పరిశీలిస్తున్న సంజీవరావు

ప్రజాశక్తి- నరసన్నపేట

ప్రైవేటు పాఠశాల విద్యార్థుల కోసం నడిపిన బస్సులకు ఫిట్నెస్ తప్పనిసరిగా ఉండాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.సంజీవరావు ఆదేశించారు. నరసన్నపేట జాతీయ రహదారిపై ప్రైవేటు పాఠశాల బస్సులను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి బస్సులో ఫైర్ డిటెక్టివ్ సిస్టం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఏదైనా విపత్తు సంభవించినప్పుడు జాగ్రత్తలు తీసుకుంటే ఆ ప్రమాదం నుంచి బయటపడవచ్చునని తెలిపారు. శ్రీజ్ఞానజ్యోతి, జ్ఞానజ్యోతి, మినర్వ, శార్వాణి 26 పాఠశాలల బస్సులను పరిశీలించారు.

నాణ్యత లేని బిటి రోడ్డు

మందస: మండలంలోని ఐటిడిఎ ద్వారా మంజూరైన దేవిపురం నుంచి కొండల్లోగాం వరకు రెండు రోజుల క్రితం తారు రోడ్డు వేశారు. ఈ రోడ్డు నిర్మాణంలో నాణ్యత కొరవడిందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ముక్కలు ముక్కలుగా ఊడుతున్న వైనం చూసి ఆ రోడ్డు మార్గాన ప్రయాణించే ప్రయాణికులు ముక్కున వేలేసుకుంటున్నారు. పెద్ద వాహనాలు నడిస్తే ఉన్న రోడ్డు పూర్తిగా ఊడిపోయే పరిస్థితి నెలకొని ఉంది. మళ్లీ పునరుద్ధరించి నాణ్యతతో కూడిన రోడ్డును వేయాలని గిరిజనులు కోరారు.


ఊడుతున్న తారు రోడ్డు

విశ్రాంత సైనికునికి ఘన స్వాగతం

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి మొగలిపాడులో విశ్రాంత సైనికుడు బొర్ర శ్యామ్‌సుందరరావుకు బుధవారం గ్రామస్తులు ఘనంగా పలికారు. 25 సంవత్సరాలు దేశ సేవలో నిమగ్నమై, చివరగా గుజరాత్‌లో హవల్దారుగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు స్వగ్రామం మొగలిపాడుకు చేరుకున్నారు. సందర్భంగా అతని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పొలిమేరకు చేరుకొని ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి- ఆమదాలవలస

సిఎం సహాయనిధితో బాధితులకు ఆర్థిక ఆసరా చేకూరునుందని మాజీ ఎంపిపి ఎమ్మెల్యే సతీమణి కూన ప్రమీల అన్నారు. బుధవారం మండలం, మున్సిపాలిటీలోని పలు బాధిత కుటుంబాల గృహాలకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని దన్నానపేటకు చెందిన దన్నాన రేయమ్మకు 43 వేలు, పొన్నాంపేటకు చెందిన మొరకాన దాలి గురువులు రూ.1,12000, సైలాడకు చెందిన జోగి ఉపేంద్రకు రూ.24 వేలు, మున్సిపాలిటీకి చెందిన బోయిన సాయిరాజ్ రూ.33 వేలు చెక్కులను అందజేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి వైద్యఖర్చుల నిమిత్తం సిఎం చంద్రబాబునాయుడు సహాయం అందించేందుకు కట్టుబడి ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, టిడిపి మండల అధ్యక్షుడు నూక రాజు, పివివికె రాజు, ఎంపిటిసి గొర్లె సూర్యం, టిడిపి పట్టణ మహిళా అధ్యక్షులు బోయిన సునీత, టిడిపి నాయకులు గుడ్ల దుర్గాప్రసాద్, సిల్లా గురునాధరావు, పొట్నూరు హరి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో కోటి సంతకాల సేకరణ పూర్తి

పత్రాలను అందజేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని వైసిపి ఆధ్వర్యాన చేపట్టిన కోటి సంతకాలు సేకరణ పూర్తయిందని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఛాంబర్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. అనంతరం పూర్తి చేసిన సంతకాలు సేకరణ పత్రాలను జెడ్‌పి చైర్‌పర్సన్‌కు వైసిపి నాయకులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ భారతీదివ్య, వైసిపి నేతలు ప్రకాశరావు పట్నాయక్, కాళ్ల సత్యం, కౌన్సిలర్ సాలిన ఢిల్లీ, సుగ్గు ప్రేమ్, బచ్చు జగన్, మధుమూర్తి, ప్రతినిధులు నీలపు ఢిల్లీ, షఫీ పాల్గొన్నారు.